క్లుప్తంగా

సొసైటీ సేవలు అభినందనీయం



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పేద ముస్లిం పిల్లల విద్యాభివృద్ధికి ఆర్థిక చేయూతనందిస్తున్న అల్ అమీన్ జకాత్ సొసైటీ సేవలు అభినందనీయమని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సాలాబాయి అన్నారు. మంగళవారం జూనియర్ కాలేజీలో జకాత్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న 60 మంది ముస్లిం పేద విద్యార్థులకు (ఫస్టియర్‌కు రూ.1,500, సెకిండియర్‌కు రూ.2 వేలు చొప్పున) రూ.లక్ష స్కాలర్‌షిప్‌ను అందజేశారు. అనంతరం జకాత్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హమీద్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు దాదాఖాన్, అధ్యక్షుడు అక్తర్‌బాషా, కార్యదర్శి నజీర్, కోశాధికారి నూర్‌సాబ్, రిటైర్డ్ రైల్వే హెల్త్ ఆఫీసర్ సర్దార్‌బాష, సంయుక్త కార్యదర్శి ఆలంనవాజ్, లాయర్ ఆరీఫ్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సేవలు అమోఘం



సెటిల్‌మెంట్ ఫారాలు అందజేస్తున్న డీఆర్‌ఎం

గుంతకల్లు: విధి నిర్వహణలో రైల్వే ఉద్యోగులు అందించిన సేవలు అమోఘమని డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా అన్నారు. ఇటీవల డివిజన్ వ్యాప్తంగా పదవీ విరమణ పొందిన దాదాపు 23 మంది ఉద్యోగులకు సెటిల్‌మెంట్ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీఓ)తోపాటు సెటిల్‌మెంట్ డ్యూస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ కుటుంబసభ్యులతో ఆరోగ్యవంతమైన జీవితం గడుపుతూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ డీఎఫ్‌ఎం కోఆర్డినేషన్ హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

యాడికి: 'పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం సాధ్యం. వర్షాలు వస్తుండటంతో గ్రామాల్లో గుంతల వద్ద, మురికి కాలువల వద్ద నీరు ఎక్కువగా నిల్వ ఉండకుండా చూసుకోవాలి' అని వైద్యాధికారులు పరమేశ్వర, సుమంత్ రెడ్డి, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వారు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి ఆశాడే నిర్వహించారు. సీహెచ్ఓ జుబేదా భేగం, సూపర్వేజర్లు రాం ప్రసాద్ గౌడ్, శోభారాణి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన




స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో కేంద్రీయ విద్యాలయం ఎదురుగా ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు మంగళవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ పుణ్యవతి, గుంతకల్లు ఫైర్ ఆఫీసర్ అశ్వర్థ తదితరులు స్థలాలు పరిశీలించారు. త్వరలోనే ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఫైర్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

గుంతకల్లులో దంచికొట్టిన వాన

గుంతకల్లుటౌన్: గుంతకల్లు పట్టణంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురవడంతో పలు మురికివాడలు, లోతట్టు కాలనీల్లోని ఇళ్లల్లోకి నీరు చేరాయి. మెయిన్‌రోడ్డుతో పాటు ఇతర రహదారుల్లో మోకాల్లోతు వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఘనంగా మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మన్యుసూక్తహోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సొంత భవనాలకు మోక్షమెప్పుడో?

- నిధుల విడుదలలో జాప్యం.. ఉర్దూ స్కూళ్ల నిర్మాణాలకు శాపం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బీటీ పక్కీరప్ప కాలనీలో పునాదులకే పరిమితమైన న్యూ ఉర్దూ పాఠశాల భవన నిర్మాణ పనులు



60 అడుగుల రోడ్డులో నిలిచిపోయినన ఉర్దూ స్కూల్ భవన నిర్మాణం

గుంతకల్లు టౌన్: ముస్లిం మైనార్టీల సంక్షేమంతో పాటు పిల్లల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తామంటూ పాలకులు ఊదరగొడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఉర్దూ పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఉర్దూ పాఠశాలలకు సొంత భవనాల్లేకవడంతో తొమ్మిదేళ్ల క్రితం సర్వశిక్షా అభియాన్ కింద 60 అడుగుల రోడ్, బీటీ పక్కీరప్ప కాలనీల్లో స్కూల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే నేటికి ఆ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తికాలేదు. ప్రభుత్వం నిధులు చెల్లించడంలో చేసిన జాప్యమే ఈ భవనాలకు శాపంగా మారింది. వివరాల్లోకెళితే..

సత్యనారాయణ పేటలోని కందుకూరి వీరేశలింగం పంతులు మున్సిపల్ స్కూల్‌లోని ఓ గదిలో న్యూ ఉర్దూ ప్రైమరీ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. అందులో ప్రస్తుతం 12 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ స్కూల్‌కు బి.టి.పక్కీరప్ప కాలనీలో సొంతభవన నిర్మాణానికి 2016–17లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించింది. దీనికి సర్వశిక్ష అభియాన్ కింద తొలుత రూ.లక్ష మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ పునాదులు, టాయిలెట్లు నిర్మించి.. నిధులు రాకపోవడంతో పనులను అర్ధాంతరంగా ఆపేశాడు. ప్రస్తుతం ఆ పరిసరాలు చాలా అధ్వాన్నంగా మారాయి. నిర్మాణాల చుట్టూ మురుగు చేరి పరిసరాలు కంపుకొడుతున్నాయి.

అర్ధంతరంగా పనుల నిలిపివేత

తిలక్‌నగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ స్కూల్ భవనంలోని ఓ గదిలో న్యూ మున్సిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూల్ నిర్వహిస్తున్నారు. అందులో 30 మంది పేద ముస్లిం విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాలకు సొంత భవనం లేదు. దీంతో 2016–17 మధ్యన గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 60 అడుగుల రోడ్‌లోని డిపెప్ స్కూల్ వద్ద ఉర్దూ స్కూల్ సొంత భవన నిర్మాణానికి పనులు ప్రారంభించారు. సర్వశిక్షా అభియాన్ అప్పట్లో నిర్మాణానికి కేవలం రూ. లక్ష మాత్రమే నిధులు విడుదల కావడంతో అప్పటి కాంట్రాక్టర్ పునాదులు, టాయిలెట్లు నిర్మించి వదిలేశాడు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన బడి నాడు–నేడు ఫేజ్–2 కింద ఈ స్కూల్‌ను పూర్తి చేసేందుకు రూ.11 లక్షలు మంజూరు చేయగా అందులో రూ.9.20 లక్షలు వెచ్చించి భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అంతలోనే కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో నిధులు చెల్లించని కారణంగా చివరి దశ పనులకు నోచుకోలేదు. ఇక పోర్టర్స్‌లైన్‌లోని మీర్జా గాలిబ్ మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని 2017లో పడగొట్టి..ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టలేదు. దీనిని బట్టిచూస్తే ఉర్దూ స్కూల్‌ల అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యమో ప్రస్ఫుటమవుతోంది. ఇప్పటికైనా మూడు స్కూళ్ల భవన నిర్మాణాలను పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ముస్లిం మైనార్టీలు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయించేందుకు కృషి



ఉర్దూ పాఠశాలల భవనాల్లో ఒకటి దాదాపుగా పూర్తికావొచ్చింది. మరొకటి నిర్మాణం జరగాల్సి ఉంది. అసంపూర్తిగా ఆగిపోయిన భవన నిర్మాణాల వివరాలను ఉన్నతాధికారులు అడిగితే పంపాం. మన బడి–మన భవిష్యత్తు కార్యక్రమం కింద నిధులు మంజూరు కాగానే వాటిని పూర్తి చేయిస్తాం. – మస్తాన్‌రావు, ఎంఈఓ, గుంతకల్లు

యల్లనూరు మండల అధ్యక్షుడిగా గొడ్డుమర్రి శివశంకర్



శింగనమల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా గొడ్డుమర్రి శివశంకర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

విధులకు హాజరైన తహసీల్దార్

యాడికి: కలెక్టర్ ఆదేశాల మేరకు ఢిల్లీలో నిర్వహించిన విపత్తుల నిర్వహణపై 14 రోజుల శిక్షణ పూర్తి కావటంతో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి మంగళవారం విధులకు హాజరయ్యారు ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఏమైనా సమస్య ఉంటే కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు.

227 మందికి ఉద్యోగావకాశాలు

గుంతకల్లుటౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 227 మంది అభ్యర్థులు వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. జాబ్‌మేళాకు 453 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారిలో 227 మంది ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జయరామ్, ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీఓ ప్రతాప్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్, సీడాప్ నారాయణస్వామి, కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి కరువు

- తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం
- సమావేశానికి 11 శాఖల అధికారుల డుమ్మా



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



నీటి సమస్యపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ నాగప్ప

గుంతకల్లు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంపై అటు ప్రజా ప్రతినిధులకు గానీ, ఇటు అధికారులకు గానీ ఏ మాత్రం చిత్తశుద్ధి లేకపోవడంతో మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రజా సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం అధికారులు, ప్రజా ప్రతినిధుల తీరు కారణంగా నీరుగారిపోతుంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. దాదాపు 13 శాఖల అధికారులు హాజరుకావాల్సిన ఈ సమావేశానికి కేవలం రెండు ప్రభుత్వ శాఖల అధికారులు మాత్రమే హాజరవ్వడం, దానికితోడు ప్రజా ప్రతినిధులు సైతం అంతంత మాత్రంగానే హాజరవడం చూస్తుంటే ప్రజా సమస్యలపై వీరికున్న చిత్తశుద్ధి ఏమిటో ఇట్టే అర్థం అవుతుంది. 25 గ్రామ పంచాయతీలు, 39 గ్రామాలు ఉన్న గుంతకల్లు మండలంలో 25 మంది సర్పంచులు, 13 మంది ఎంపీటీసీలు ఉన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లోనూ నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను చర్చించే క్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతి మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఎంపీటీసీలు సర్పంచులు, అధికారులు సమావేశానికి హాజరై ప్రజా సమస్యలను చర్చించి వాటి పరిష్కారం మార్గాలను గుర్తించడంతోపాటు, వాటిని వెంటనే అమలు చేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అధికారుల మాట అటుంచితే ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులే సమావేశానికి సక్రమంగా హాజరుకావడం లేదు. మండలంలో 25 మంది సర్పంచులు ఉంటే కనీసం ఐదుగురు సర్పంచులు కూడా సమావేశానికి హాజరుకావడం లేదంటే పరిస్థితి అర్థం అవుతుంది. సర్వసభ్యసమావేశం నిర్వహించే రోజు సమావేశం నిర్వహణకు అవసరమైన కోరం సభ్యులు వచ్చేదాకా వేచి చూడటం, కోరం సభ్యులు రాగానే సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి ముగించడం ఆనవాయితీగా మారింది.

ప్రశ్నించినా సమస్యలు పరిష్కారం కావడం లేదు

సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యే కొంతమంది ఎంపీటీసీలు మాత్రం ఒకే సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదని, దీంతో చెప్పడానికి మాకే విసుగొస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మొలకలపెంటలో గత నాలుగేళ్లుగా తీవ్రమైన నీటి ఎద్దడి ఉందని, సమస్య పరిష్కరించాలని, పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని ఎంపీటీసీ నాగప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. వైటీ చెరువు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకుకు నిచ్చెన లేకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా ట్యాంకును శుభ్రం చేయడం లేదని, దీనివల్ల ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని కోఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ బీవీ మాధవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగభూషణ, జెడ్పీటీసీ కదిరప్పల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి తహసీల్దార్ రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా మాత్రమే హాజరయ్యారు.

డ్రైవర్ పోస్టులకు ఆహ్వానం

తాడిపత్రి రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో దినసరి వేతనం కింద పనిచేయడానికి ఆసక్తి ఉన్న డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం డిపో మేనేజర్ మురళీధర్ మంగళవారం తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, ఆర్టీఓ కార్యాలయం నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన క్లియరెన్స్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో పాటు వైద్యుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకుని తన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నాటుసారా విక్రేతకు రిమాండ్

యాడికి: మండల కేంద్రానికి చెందిన చింతా లోకేశ్వర రాఘవేంద్ర కాలనీలో నాటుసారా విక్రయిస్తుండగా మంగళవారం సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశామని ఎస్ఐ వెంకట రమణయ్య తెలిపారు. అతడి నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

మట్కాబీటర్ అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ సర్కిల్‌లో మట్కా రాస్తున్న ఎస్.బాషా అనే వ్యక్తిని మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. అతడి నుంచి రూ.7,560 నగదుతో పాటు మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

యాడికి: మండలంలోని పచ్చారుమేకలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల సహాయ కార్యదర్శి తమ్మెట్ల ఆదినారాయణ తండ్రి తమ్మెట్ల సంజప్ప(88) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, సీనియర్ నాయకుడు చిన్న వెంకటనాయుడు పచ్చారుమేకలపల్లికి వెళ్లి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

కడవకల్లులో 'పొలం పిలుస్తోంది'

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. పంటలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. ఏఓ కాత్యాయని, ఆత్మా ఏటీఎం గౌతం, రైతు సేవా సిబ్బంది శివ, సూరి, నాగలింగేశ్వర, రైతులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల నిర్వహణపై సమావేశం

తాడిపత్రి రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని నిర్వహించనున్న ఉత్సవాలపై మంగళవారం ఉత్సవ కమిటీ, రుద్రభూమి కమిటీ సభ్యులతో మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమావేశమయ్యారు. స్థానిక కార్యాలయంలో వారితో జేసీ మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటు, నిర్వహణ, నిమజ్జనం తదితర అంశాలపై చర్చించారు. వినాయక చవితిని ప్రశాంతంగా, వైభవంగా జరుపుకోవడానికి అందరి అభిప్రాయాలను తీసుకునేందుకు ఈనెల 8న మరోసారి సమావేశం నిర్వహిస్తామన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వాసులు వర్షం కోసం గత రెండు రోజులు గా సుంకులమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి పోతులయ్య స్వామి కి 101 కడవల నీటితో అభిషేకం చేశారు. ఇప్పటికే మండలంలో దాదాపు 50 శాతం మంది రైతులు ముంగారు వర్షాలకు పంటలు సాగు చేసుకోగా మరి కొంతమంది ఇటీవల వచ్చిన అరకొర వర్షాలకు పంటలు సాగు చేశారు. వరుణుడి కరుణ కోసం ఈ పూజలు చేస్తున్నామని కాలనీవాసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కేసీ రంగయ్యకు నివాళి

పామిడి: పట్టణంలో మంగళవారం శింగనమల నియోజకవర్గ ప్రథమ ఎమ్మెల్యే కేసీ రంగయ్య 25వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అనాథాశ్రమంలో అనాథలకు అన్నదానంతో పాటు వస్త్రదానం చేపట్టారు, కార్యక్రమంలో ఆయన కటుంబసభ్యులు, కవి కే నారాయణమూర్తి, కే ప్రకాష్, కళ్యాణి, రవీంద్ర, రాజేష్, వేదప్రియ, నాగరమ్య పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన రైతు సోమశేఖర్ మంగళవారం పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పొలంలోని గట్టుపై ఉన్న కలుపు తొలగిస్తున్న సమయంలో సోమశేఖర్‌ను పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమ్మెట తగిలి వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో మంగళవారం సప్లయర్స్‌లో పని చేసే నాగేంద్ర అనే వ్యక్తి ప్రమాదవశాత్తు ఇనుప చువ్వను సమ్మెటతో కొడుతున్న సమయంలో కాలుకి కొట్టుకున్నాడు. దీంతో కాలు నాలుగు వేళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. విపరీతంగా రక్త స్రావం జరిగింది. స్థానికులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన

పామిడి: పామిడితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం వాట్సప్ గవర్నెన్స్‌పై అధికారులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పామిడిలో ఎంపీడీఓ కే తేజోత్స్న ఆధ్వర్యంలో స్థానిక బీసీసీ రోడ్డుపై అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ కమ్ ఈఓఆర్డీ అశ్వర్థనాయుడు, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో 'కూటమి' విఫలం



శింగనమల మండలం ఆకులేడులో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



నార్పల మండలం బి.పప్పూరులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



తాడిపత్రి పట్టణంలో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

శింగనమల: హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ విమర్శించారు. మంగళవారం మండలంలోని మదిరేపల్లి, ఆకులేడు, లోలూరు, రగనాథపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. పూల ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువుదీరి సంవత్సరం దాటినా సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వీరాంజనేయులు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు తరిమెల భాస్కర్ రెడ్డి, నాయకులు రామాంజనేయులు, నలపరెడ్డి, ఎంపీటీసీ మురార్జీ, మదిరేపల్లి రవీంద్రారెడ్డి, సర్పంచ్ వెంకటరాముడు, చాగంటి గురుమూర్తి రెడ్డి, నూర్ మహమ్మద్, కొండయ్య, గంగాధర్, మండల కో–ఆప్షన్ మెంబరు ఆలీ బాషా, బండి శ్రీనివాసులు, రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్పల: ముఖ్యమంత్రి చంద్రబాబు ష్యూరిటీ అంటే మోసాలే కాదు అవినీతి, అక్రమాలు, అపద్ధపు హామీలు గ్యారెంటీ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి మండిపడ్డారు.వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పిలుపు మేరకు మంగళవారం బి.పప్పూరు, బొమ్మకుంటపల్లి, మాలవాండ్లపల్లి, బొందలవాడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్, ఎంపీపీ నాగేశ్వరావు, ఎంపీటీసీ పద్మాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, పెద్దిరెడ్డి, సంజీవరాయుడు, అంజి, కొనంకి రంగయ్య, కొండారెడ్డి, మంజునాథ్‌రెడ్డి, పుల్లారెడ్డి, ముత్యాలు, ఉమాపతి, మునయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని జయనగర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం తాడిపత్రి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయకార్యదర్శి జిలాన్ బాషా, సీడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, పేరం ప్రతాప్‌రెడ్డి, విద్యార్థి విభాగం నాయకుడు మనోజ్‌కాశీ, చేనేత అధ్యక్షుడు గద్దం పరమేష్, బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ డీవీ కుమార్, మహిళా నాయకురాలు ఫరీఫా, ఓబులేసు రెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి లక్ష్మీరంగయ్య, రబ్బాని, తాడిపత్రి పట్టన కార్యదర్శి సుధీర్, సునిల్, సోషల్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, సూర్యప్రభాకర్‌బాబు, రఘు, రాజు, ముస్తాఫా, రామక్రిష్ణ, విజయకుమార్, శివ పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వెంకటరమణ నాయక్

శింగనమల: అధ్యాపకులు నిర్ణీత సమయంలో విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలని జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణ నాయక్ సూచించారు. మంగళవారం శింగనమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడారు. విద్యార్థులకు నిబంధనల ప్రకారం నిర్ణీత సమయానికి పాఠ్యాంశాలు పూర్తి చేయలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ, వాటిని మూల్యాంకనం చేసి, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడానికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ, మధ్యాహ్నం భోజనం నాణ్యతపై ఆరా తీశారు. నాణ్యతగా భోజనాన్ని తయారు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీసమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ కల్యాణమండలంలో బుధవారం ఉదయం 10గంటలకు ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశం నిర్వహించనున్నట్లు సీడీపీఓ సాజిదాభేగం తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని తాడిపత్రి పట్టణ, రూరల్, పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు హాజరు కావాలన్నారు. కాగా ఈ నెల 10న నిర్వహించనున్న మహాసభలను దృష్టిలో ఉంచుకుని తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం కావడానికి జిల్లాకు చెందిన యునియన్ నాయకులు హాజరుకానున్నారని తెలుస్తోంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగులకొట్టండి



పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు సబ్ స్టేషన్ వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/ గుత్తి/ తాడిపత్రిటౌన్/ యాడికి/ పెద్దపప్పూరు/శింగనమల/ గార్లదిన్నె/ పామిడి/ పెద్దవడుగూరు/ పూట్లూరు: ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగులకొట్టాని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ప్రజలపై విద్యుత్ మోపిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం విద్యుత్ నిలయం ఎదుట సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో కార్యకర్తలు, ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్‌మీటర్లు బద్దలు గొట్టండని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపునిచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా అని వారు ప్రశ్నించారు. ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట ఏడాదిలోనే రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడమే కాకుండా మళ్లీ ఇప్పుడు రూ.12,700 కోట్ల వసూలు చేయడానికి కూటమి సర్కారు సిద్ధమైందని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీపీఐ పట్టణ కార్యదర్శి మారుతి, మండల కార్యదర్శి రాము, న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు జిలాన్, సత్తార్ పాల్గొన్నారు. అలాగే గుత్తిలో నిర్వహించిన ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, ఏఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు. తాడిపత్రిలో నిర్వహించిన ఆందోళనలో సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, పట్టణ సహాయ కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు. యాడికిలో సీపీఐ మండల కార్యదర్శి జూటూరు రఫీ, సీపీఎం కార్యదర్శి బషీర్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడుయాదవ్ పాల్గొన్నారు. పెద్దపప్పూరులో సీపీఐ మండల సహాయక కార్యదర్శి రామక్రిష్ణ, చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి నారాయణస్వామి, చింతా పురుషోత్తం పాల్గొన్నారు. శింగనమలలో సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు భాస్కర్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె, పామిడి, పెద్దవడుగూరు, పుట్లూరు మండలంలోని ట్రాన్స్ కో కార్యాలయాల ఎదుట స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వామపక్ష నాయకులు ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.